పకడ్బందీగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

- కొనసాగుతున్న అర్హుల గుర్తింపు
- గ్రామాల్లో అధికారుల క్షేత్ర స్థాయి పరిశీలన
- లబ్ధిదారుల ఎంపికకు పక్కా ప్రణాళిక
- ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన


ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

తాడూర్: రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చే పట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై దృష్టి పెట్టింది. మండలంలో ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ప్రకటించి ఇళ్లు మంజూరు చేశారు. ఇళ్ల నిర్మాణ పులు వేగంగా చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో మొదటి దఫా బెస్‌మెంట్ ఇళ్లకు బిల్లులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ప్రజా పాలనలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించి ఇళ్లు ఇవ్వాలనే ఉద్దేశ్యంతో మొదటి విడతగా గ్రామాల్లో సర్వే నిర్వహించారు.

525 ఇళ్లు మంజూరు

రాష్ట్ర ప్రభుత్వం మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు గాను గుట్టలపల్లి గ్రామాన్ని పైలట్ గ్రామంగా ప్రకటించగా, మిగతా 23 గ్రామాలకు 525 ఇళ్లను మంజూరు చేశారు. మండల కేంద్రం తాడూరుకు 50 ఇళ్లు మంజూరు కాగా, మిగతా గ్రామాలకు జనాభా అవసరాన్ని బట్టి మంజూరు చేశారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వాటిలో నుంచి 525 నిరుపేదలను గుర్తించి వారికి ఇళ్లను మంజూరు చేశారు. పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన గుట్టలపల్లిలో 12 ఇళ్లు నిర్మాణం బెస్‌మెంట్ లేవల్ పూర్తి చేసిన లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున ఖాతాలో జమ చేశారు.

గెజిటెడ్ అధికారులతో సర్వే..

రాష్ట్రప్రభుత్వం అందించిన మొదటి విడత దరఖాస్తుల ఆధారంగా చేసుకుని జిల్లా స్థాయి, మండల స్థాయి వెరిఫికేషన్‌కు గెజిటెడ్ అధికారులను నియమించింది. వీరు గ్రామాల్లో లబ్ధిదారుల జాబితా ఆధారంగా ఇంటింటికి వెళ్లి ఎలా ఉంది, కొత్తగా ఇంటి నిర్మాణానికి స్థలం ఉందా లేదా? అనే వివరాలతో పాటు ఇళ్లు మంజూరు చేస్తే నిర్మించుకునేందుకు లబ్ధిదారులు సిద్ధంగా ఉన్నారా? అనే విషయాలు తెలుసుకుంటున్నారు. ఈ సర్వేను అధికారులు 30లోగా పూర్తి చేయాల్సి ఉంది. మండలంలో 714 మందితో కూడిన మొదటి లిస్టులో 525 మందికి ఇళ్లు మంజూరు అయినట్లు అధికారులు తెలిపారు.


క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

రోజువారి కార్యక్రమాలు..

ఈనెల 30లోగా గెజిటెడ్ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేసి ఎంపీడీఓ లాగిన్‌కు మెరిట్ లిస్టు తీయగా, గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద బహిర్గతంగా ఉంచడం, ఆ తర్వాత లిస్టును ఆన్‌లైన్‌లో ఏర్పాటు చేసి, గెజిటెడ్ అధికారులు నిర్వహించిన సర్వేలో అర్హుల జాబితాను జిల్లా స్థాయి అధికారులకు పంపుతారు. 525 ఇళ్ల వివరాలు రీ సర్వే పూర్తి చేయగా అందులో ఉన్న వివరాలను కలెక్టర్ లాగిన్‌లో నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

పూర్తి అయిన రీ సర్వే



మండలంలోని అయా గ్రామాల్లో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు నలుగురు గెజిటెడ్ అధికారులతో రీ సర్వే పూర్తి చేశాం. నిర్దేశించిన సమయం కంటే ముందుగానే సర్వేలు పూర్తి చేసి అర్హుల లిస్టును కలెక్టర్ లాగిన్ పంపించాం.

– ఆంజనేయులు, ఎంపీడీఓ

యువత మేలుకో.. గంజాయి మానుకో


కరపత్రం విడుదల చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, కలెక్టర్ సంతోష్

- ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ

మన్ననూర్: రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ప్రచురించిన 'యువత మేలుకో గంజాయి మానుకో' అనే కరపత్రాలను ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 10 ఏళ్ల కాలంలో యువత పూర్తిగా పెడదారి పట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకులు ఉద్యోగ అవకాశాలు కల్పించక నిరుద్యోగ సమస్యతో యువత దిక్కుతోచని పరిస్థితిలో మత్తుకు బానిసలయ్యారని అన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం డ్రగ్స్ మహమ్మరిని రాష్ట్ర వ్యాప్తంగా కట్టడి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ బాదావత్ సంతోష్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ, డీఎఫ్ఓ రోహిత్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు, శ్రీమంతుడు జలంధర్‌రెడ్డి, రాజ్యాంగ పరిరక్షణ వేదిక కన్వీనర్ విజయ్‌మోహన్, నాయకులు రాజేందర్, మల్లేష్, కాశన్న యాదవ్, హరినారాయణ గౌడ్, వెంకట్‌రెడ్డి, రాములు, వెంకటరమణ, బాలింగంగౌడ్, శ్రీనివాసులు, నాగయ్య, రేణయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యేకు వినతి

వెల్దండ: మండలంలోని భర్కత్‌పల్లి గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ సోమవారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. వర్షాకాలంలో అంతర్గత కాలనీ రోడ్లు బురదమయంగా మారి నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. అండర్ డ్రైనేజీ లేకపోవడంతో మురుగు రోడ్లపై పారుతుందన్నారు. పాతవైర్లు ఉండడంతో తరుచుగా విద్యుత్ ప్రమాదాలకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మానిక్యంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి

నాగర్‌కర్నూల్: వివిధ శాఖలలో ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అమరేందర్ అన్నారు. సోమవారం నాగర్ కర్నూల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి 37 దరఖాస్తులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్ వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ అమరేందర్

క్లుప్తంగా

నేడు భైరాపూర్‌లో రథోత్సవం

వెల్దండ: మండలంలోని భైరాపూర్ గ్రామంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం ఆలయంలో నిత్య హోమం, పుష్పయాగం, తీర్థగోష్టి, గరుడవాహన సేవ కార్యక్రమాలు నిర్వహించారు. రథోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో భక్త బృందం సభ్యులు, ఆలయ అర్చకులు తదితరులు ఉన్నారు.

జిల్లా కోర్టు జడ్జికి సన్మానం



నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కోర్టు జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన రమాకాంత్‌ను సోమవారం జిల్లా కోర్టులో ఆమనగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదిలాల్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జిని శాలువా, పూలబోకేతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది మహ్మద్ జమీల్, ఆమనగల్ బార్ అసోసియేషన్ కోశాధికారి కృష్ణ, ఆంజనేయులు, శ్రీనివాస్, శిరీష్, శ్రీశైలం, మసూద్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ



మన్ననూర్: అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆదేశాల మేరకు అమ్రాబాద్ మండల అధ్యక్షుడు హరినారాయణ ఆధ్వర్యంలో గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ పిట్టల సురేష్, యూత్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ గౌస్, ఉపాధ్యక్షుడు రసూల్ బాబ, అనిల్‌తో పాటు మరి కొందరు ఎంపికయ్యారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు రహీం, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, రవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటరమణ, సత్యనారాయణ, శంకరయ్య, రాజేంద్ర ప్రసాద్, సైదులు, డాక్టర్ సురేష్, ఇస్మాయిల్, రమణగౌడ్, జాకీర్, రెహమాన్, కృష్ణయ్య, గోపాల్, శ్యాంసుందర్‌రెడ్డి, రమేష్, గంగాజీ, చందాజీ పాల్గొన్నారు.

వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని రామాపురం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో సోమ వారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రా రంభించారు. ఈ సందర్భంగా సీసీ బ్రహ్మాచారి మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మకాలు చేయాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా నర్సుల దినోత్సవం



కల్వకుర్తి టౌన్: అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పట్టణంలోని సీహెచ్‌సీలో ఘనంగా నిర్వహించారు. సోమవారం పట్టణంలోని సీహెచ్‌సీలో నర్సు నైటింగేల్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి నివాళులర్పించి, పూలదండలు వేశారు. అనంతరం సూపరింటెండెంట్ శివరాం మాట్లాడుతూ నర్సులు వైద్యవృత్తిలో చాలా కీలకమని, వారి పాత్ర లేకుండా ఆసుపత్రి నిర్వహణ కష్టమని కొనియాడారు. అనంతరం కేక్ కట్‌చేసి సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు యశోధ, విష్ణు, పాండురంగ, స్వప్న, నర్సింగ్ అధికారులు బాలమణి, జాయ్‌మేరీ, సునీత, ఫార్మాసిస్టు మైకేల్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షం



కల్వకుర్తి రూరల్: మండలంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. మండలంలోని మార్చాల, కురుమిద్ద, తర్నికల్, పంజుగుల తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. దాదాపు గంట పాటు గాలులతో కూడిన వర్షం కురవడంతో మార్చాల–కురుమిద్ద గ్రామాల మధ్య చెట్లు రోడ్డుపై కూలిపోయాయి. ఈ విషయం గమనించిన గ్రామస్తులు వర్షంలో తడుస్తూ రోడ్డుపై పడ్డ చెట్లను పక్కకు తొలగించి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చేశారు. అప్పటివరకు బాగా ఎండకాసి ఒకేసారి గాలులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలు ఆందోళన చెందారు.

సాంకేతిక పరిజ్ఞానంతో బోధించాలి

- డీఈఓ రమేష్ కుమార్

కందనూలు: మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకొని తరగతి గదిలో బోధన సాగించేలా, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్ అన్నారు. ఉపాధ్యాయుల నైపుణ్యాలను మెరుగుపరచడం ద్వారా విద్యార్థుల భవిష్యత్‌కు దోహదపడుతుందన్నారు. మొదటి విడత శిక్షణ 13 నుంచి 17వ తేదీ వరకు, రెండో విడత శిక్షణ 19 నుంచి 23 వరకు, మూడో విడత 27 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణ తరగతుల ఇన్‌చార్జులు, జిల్లా రీసోర్స్ పర్సన్ల సంసిద్ధత సమావేశం సోమవారం డీఈఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. మంగళవారం నుంచి ప్రారంభం కానున్న ఉపాధ్యాయుల శిక్షణా తరగతులకు అవసరమైన సదుపాయాలు కల్పించి శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని అన్నారు. ఉపాధ్యాయులు రోజూ ఉదయం 9:30 గంటలకు శిక్షణ తరగతులకు ప్రతి ఉపాధ్యాయుడు విధిగా హాజరు కావాలని కోరారు. డిజిటల్ ఎడ్యుకేషన్, కాంటెంట్ ఎనిచ్మెంట్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, లైఫ్ స్కిల్లింగ్ అవుట్కమ్స్ తదితర విషయాలపై స మగ్ర శిక్షణా తరగతులను నిర్వహించాలని సూచించారు. బిజినపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు, తెలకపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుల శిక్షణా తరగతులు, తాడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం, ప్రత్యే క అవసరాల విద్యా ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు, కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో మండల స్థాయి ఎమ్మార్పీలకు శిక్షణ తరగతుల ను నిర్వహించనున్నట్లు డీఈఓ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న 3,513 మంది వివిధ స్థాయిల ఉపాధ్యాయులు శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా నోడల్ అధికారి కురుమయ్య, అకాడమిక్ మానిటరింగ్ అధికారి షర్ఫుద్దీన్, సీఎం బరపటి వెంకటయ్య, జీసీడీఓ శోభారాణి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఈఓ రమేష్‌కుమార్

ఘనంగా గౌతమ బుద్ధుడి జయంతి



నాగర్‌కర్నూల్ రూరల్: స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో అంబేడ్కర్ ఐడియాలజీ మిషన్ బుద్దిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మానవతా ప్రబోధకుడైన గౌతమ బుద్ధుని జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ బోధివృక్షం నీడలో తపోదీక్ష ద్వారా తన హృదయంలో వెలిగిన జ్ఞానజ్యోతి కాంతుల్ని ప్రపంచానికి పంచాలనే సంకల్పంతో ఆధ్యాత్మిక యాత్ర ప్రారంభించిన గౌతమ బుద్ధుని జయంతి నిర్వహించారు. ప్రజలందరు బుద్ధుని మార్గంలో పయనించాలన్నారు. కార్యక్రమంలో మద్దిలేటి, చంద్రయ్య, వెంకటస్వామి, గోవర్ధన్, ఈశ్వర్, రాము, రాములన్న, బాలస్వామి, నరసింహ, కురుమయ్య, శేషగిరి, శ్రీను, గిరి, కాంతి, కోటేశ్వర్, ఆనంద్, విక్రమ్ పాల్గొన్నారు.

రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి



పెద్దకొత్తపల్లి: మండలంలోని పెద్దకార్పముల క్లస్టర్‌లో శివారు రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి జానకిరాములు తెలిపారు. భూమి ఉన్న ప్రతి రైతుకు కేంద్ర ప్రభుత్వం 14 నెంబర్ల విశిష్ట సంఖ్య యూనిక్ కోడ్ కేటాయించడం ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. పంటల బీమా వ్యవసాయ యాంత్రికరణ తదితర పథకాలకు ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ కోసం ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్, ఫోన్ నెంబర్ తీసుకొచ్చి వ్యవసాయ విస్తరణ అధికారి దగ్గర నమోదు చేసుకోవాలని తెలిపారు.

రాజీవ్ యువ వికాసం ఇంటర్వ్యూ

- ఆయా మండల కేంద్రాల్లో దరఖాస్తుల పరిశీలన
- హాజరైన వివిధ బ్యాంకుల మేనేజర్లు, అధికారులు

సాక్షి, నెట్‌వర్క్: అచ్చంపేట మండల పరిధిలో రాజీవ్ యువ వికాసం పథకంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూ నిర్వహించారు. ఎంపీడీఓ మధుసూదన్‌గౌడ్, పంచాయతీ అధికారి లింగయ్య, బ్యాంకు అధికారులు దరఖాస్తులు పరిశీలించారు.

- పెంట్లవెల్లి మండలం, జటప్రోల్ గ్రామంలో రైతు వేదికలో ఎంపీడీఓ దేవేందర్ ఆధ్వర్యంలో జటప్రోల్ యూనియన్ శాఖ బ్యాంక్ వారు ఇంటర్వ్యూ నిర్వహించారు. మంగళ, బుధవారం కూడా పెంట్లవెల్లిలో ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు.
- బల్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల నుంచి స్పందన కరువైంది. తుమ్మెన్‌పేట తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వారు నిర్వహించిన ఇంటర్వ్యూకు 268 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 157 మంది హాజరయ్యారు.
- చారకొండ మండల కేంద్రం రైతు వేదిక కార్యాలయంలో ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ దరఖాస్తులను పరిశీలించారు. చారకొండ యూనియన్ బ్యాంకు, జూపల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్లు నరసింహ, శివప్రసాద్‌లు పత్రాలను పరిశీలించారు.

నేటి నుంచి ఇంటర్వ్యూ ప్రారంభం

వెల్దండ: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నుంచి 15వ తేదీ వరకు రాజీవ్ యువ వికాస్ ఇంటర్వ్యూ ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులు రాజీవ్ యువ వికాస్ పథకానికి 2,370 దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. 13న చెర్కూర్, పెద్దాపూర్, కుప్పగండ్ల, కేస్లీతండా, మర్రి గుంతతండా, శంకరకొండతండా, చౌదర్‌పల్లి, నారాయణపూర్‌తాండ, పల్లుతండా, భర్కత్‌పల్లి, చెదురుపల్లి, బొల్లంపల్లి, బండోనిపల్లి, ఉబ్బలగట్టుతండా గ్రామాలకు ఎస్‌బీఐ బ్యాంక్ వెల్దండ, పె ద్దాపూర్ కెనరా బ్యాంక్ అధికారులు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు సకాలంలో ఇంటర్వ్యూకు హాజరు కావాలని పేర్కొన్నారు.

- కోడేరు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కోడేరు, జనుంపల్లి, తీగలపల్లి, బావాయిపల్లి, పస్పుల, ఖానాపూర్ గ్రామాల నుంచి దరఖాస్తుదారులు ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఆయన కోరారు.


బల్మూర్‌లో ఒకేహాల్‌లో అభ్యర్థుల అందరితో ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



చారకొండ: సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ ఎస్‌కే శంషొద్దీన్ అన్నారు. మండల కేంద్రంలో సైబర్ నేరాలపై, కమ్యూనిటీ పోలిసింగ్‌పై సోమవారం ఎస్‌ఐ శంషొద్దీన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుల్లో ఎస్‌ఐ మాట్లాడుతూ నిత్యం ఎక్కడో ఒక చోట సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల ఉచ్చులో పడుతున్నారని, వాటి పట్ల మరింత జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నేరాల నియంత్రణకు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ అంజయ్య, కానిస్టేబుల్ శేఖర్, బాలరాజు, తదితరులు ఉన్నారు.

వీర జవాన్‌కు ఘనంగా నివాళి



కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ముక్కిడిగుండం గ్రామంలో వీర జవాన్ మురళి నాయక్‌కు సోమవారం రాత్రి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మురళి నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి, అనంతరం కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు అశోక్ నాయక్, మాజీ సర్పంచ్ దశరథం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో మొక్కలను సంరక్షించాలి

వెల్దండ: మండలంలోని చెర్కూర్ గ్రామంలోని నర్సరీని సోమవారం ఏపీఓ ఈశ్వర్‌జీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కావడంతో మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నర్సరీలో గ్రీన్‌మ్యాట్ వేయాలన్నారు. సకాలంలో నీరు అందించి మొక్కలను సిద్ధంగా ఉంచాలన్నారు. ఎండిపోయిన బెడ్లల్లో తిరిగి విత్తనాలను నాటించి మొక్కలను పెంచాలన్నారు. అలంకరణ మొక్కలు, పూలమొక్కలు, పండ్ల మొక్కలు, రైతులు వ్యవసాయ పొలం గట్ల వెంబడి నాటే విధంగా మొక్కలను పెంచాలన్నారు. గతంలో రోడ్లకు ఇరువైపుల నాటిన మొక్కలకు ట్యాంకర్ల ద్వారా నీరు అందించాలన్నారు. ఉదయం త్వరగా పనులకు వెళ్లి తిరిగి రావాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి హరిణి, ఫీల్డ్‌అసిస్టెంట్ కృష్ణయ్య, సిబ్బంది ఉన్నారు.


వెల్దండ మండలం చెర్కూర్ నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఏపీఓ ఈశ్వర్‌జీ

18న బీసీ రిజర్వేషన్లపై నిరాహార దీక్ష


సమావేశానికి హాజరైన బీసీ కులాల నాయకులు

పెద్దకొత్తపల్లి: 42శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఈ నెల 18న కొల్లాపూర్‌లో నిరాహార దీక్షకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని సాధన సమితి రాష్ట్ర నాయకులు పిలుపు నిచ్చారు. సోమవారం సాయంత్రం ప్రాథమిక పాఠశాల ఆవరణంలో 42శాతం బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో బీసీ కులాలతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. దేశ జనాభాలో బీసీ వర్గాల వారే అధిక శాతంలో ఉన్నారని, బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని సాధన సమితి రాష్ట్ర నాయకులు అజయ్‌కుమార్ యాదవ్ విచారం వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల సాధన కోసం గ్రామ స్థాయి నుంచి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని బీసీ కులాలన్నీ సంఘటితమై ఉద్యమించి సాధించుకోవాలన్నారు. సమావేశంలో బీసీ రిజర్వేషన్ల సాధన సమితి నాయకులు సుబ్బయ్య, భాస్కర్, ఎల్లయ్య, శ్రీనివాస్ యాదవ్, మాసయ్య, మల్లయ్య, శంకర్‌సాగర్, బీసీ నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రామాలయంలో వ్రతాలు

కందనూలు: వైశాక మాసం పౌర్ణమి సందర్భంగా జిల్లా కేంద్రంలోని రామాలయంలో భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. వ్రతాలను ఆల య ప్రధాన అర్చకుడు వరదరాజన్ అయ్యంగారి ఆధ్వర్యంలో నిర్వహించి విశిష్టత గురించి భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ప్రసాద కమిటీ సభ్యు లు కందాడై శ్రీనివాసచార్యులు, కరుణశ్రీ, అర్థం రవీందర్ పాల్గొన్నారు.


సామూహిక వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

పోడు భూములకు పట్టాలివ్వాలి

కొల్లాపూర్ రూరల్: దళితులు, గిరిజనులు సాగు చేసుకుంటున్న ఫారెస్టు భూములకు ప్రభుత్వం పట్టాలివ్వాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు అశోక్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని గేమ్యానాయక్ తండాలో రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గత 20,30 సంవత్సరాల నుంచి గిరిజన, దళిత రైతులు పోడు భూములు దున్నుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. నేటి వరకు పట్టాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి వెంటనే ప్రభుత్వం పట్టాలిచ్చి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోడు భూముల రైతులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం: వివాహిత అదృశ్యమైన సంఘటన సోమవా రం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన యాస్మిన్ బేగం గత నెల 23న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలే దు. దీంతో కుటుంబ సభ్యులు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.